క్లుప్తంగా

టిఫిన్ సెంటర్ ప్రారంభం

మోతీనగర్: రుచి, శుభ్రతతో పాటు నాణ్యమైన ఆహార పదార్థాలను అందించినప్పుడే ప్రజల మనసులను చూరగొంటారని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. బుధవారం అల్లాపూర్ డివిజన్ బ్యాంక్ కాలనీలో, వివేకానందనగర్‌కు చెందిన నస్పిడి శ్రీనివాస్ ఏర్పాటు చేసిన నాగమల్లి టిఫిన్ సెంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు.

ఆకట్టుకున్న పద్య నాటకం ప్రదర్శన


శ్రీకృష్ణ రాయబారం పద్యనాటకంలో కళాకారుల ప్రదర్శన

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని భారత వికాస్ పరిషత్ హాల్‌లో బుధవారం శ్రీ సర్వేశ్వర నాట్య మండలి ఆధ్వర్యంలో శ్రీరామాంజనేయ యుద్ధం, శ్రీ కృష్ణరాయబారం పద్య నాటాకాలు ప్రదర్శించారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఈ ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. టి.రాజబాబు, అనిల్ నిర్వహించిన ఈ పద్య నాటకంలో భాస్కర్‌రావు, వెంకటేశ్వర్లు, సర్వేశ్వరరావు, సంజీవరావు, మంగపలి రావు, రామ్మోహన్, కేశవ్, చక్రవర్తి, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగికి అండగా నిలిచిన బీఆర్‌టీయూ నేత

మూసాపేట: హైటెక్ సిటీ ప్రాంతంలోని ఆర టీజ్ స్టూడియో అనే సాఫ్ట్‌వేర్ కంపెనీలో రాజ్ కమల్ అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కొంతకాలంగా పనిచేశాడు. అనివార్య కారణాల వల్ల పని మానేయటంతో యాజమాన్యం తనకు రావాల్సిన ఒక నెల జీతం ఇవ్వలేదు. పలుమార్లు అడిగి విసుగు చెందిన ఉద్యోగి బీఆర్‌టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ గురించి తెలుసుకొని ఆయనను కలిసి తనకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. వెంటనే ఆయన స్పందించి సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రతినిధులతో పలుమార్లు చర్చించి ఉద్యోగికి రావాల్సిన ఒక నెల జీతాన్ని ఇప్పించాడు. దీంతో రాజ్‌కమల్ రవిసింగ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీనివాస్‌చారి, మనోజ్‌కుమార్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.


మనూలో 'ధనక్‌బజార్ ఎగ్జిబిషన్'

రాయదుర్గం: మహిళా వ్యాపారవేత్తలు ఉత్పత్తులు 'ధనక్‌బజార్ ఎగ్జిబిషన్' ఆకట్టుకుంది. మనూ క్యాంపస్‌లో 'మనూ' లేడీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'సఫా' ఎన్‌జీఓ పర్యవేక్షణలో ఏర్పాటైన ధనక్‌బజార్‌ను వీసీ ఐనుల్‌హసన్ చేతుల మీదుగా ప్రారంభించారు. వ్యాపారంలో మహిళలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్, 'మనూ' లేడీస్ అసోసియేషన్ అధ్యక్షురాలు అర్షియాహసన్, ఉపాధ్యక్షురాలు ప్రొఫెసర్ షాహిదా తదితరులు పాల్గొన్నారు.

20న జాతీయ సదస్సు

రాయదుర్గం: ప్రముఖ కవి గుంటూరు శేషేంద్ర శర్మ జయంతిని పురస్కరించుకొని ఈనెల 20వ తేదీన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో ఒకరోజు సదస్సును నిర్వహించనున్నట్లు సదస్సు సమన్వయకర్తలు తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, ఆచార్య పమ్మి పవన్ బుధవారం తెలిపారు. 'గుంటూరు శేషేంద్రశర్మ రచనలు-సమాలోచన' పేరుతో హెచ్‌సీయూ మానవీయ శాస్త్రాల విభాగం ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహించడం జరుగుతుందన్నారు. వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఓరియంటల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ ఆచార్య పిసి వెంకటేశ్వర్లు, యోగి వేమన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎస్ ఈశ్వర్‌రెడ్డి, సదాశివపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య తాడేపల్లి పతంజలి, ఎస్వీ డిగ్రీ ప్రభుత్వ కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ భారతి, ఆచార్య పిల్లలమర్రి రాములు, ఆచార్య గోనానాయక్, డాక్టర్ భూక్య తిరుపతి తమ పరిశోధనా పత్రాలను సమర్పిస్తారని వివరించారు.

అంగరంగ వైభవం.. దేవీ శరన్నవరాత్రి ఉత్సవం


మహాలక్ష్మి అలంకరణలో అమ్మవారు


మూసాపేట డివిజన్ ఆంజనేయనగర్‌లోని అమ్మవారి మండపంలో భక్తులు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: డివిజన్‌లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. అంజయ్యనగర్ రిటైల్ కూరగాయల మార్కెట్‌లోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు బుధవారం మహాలక్ష్మి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. లక్ష రూపాయల నోట్లతో అమ్మవారిని అలంకరించి పూజలు నిర్వహించారు. హస్మత్‌పేట చౌరస్తాలోని అమ్మవారి మండపంలో మహాలక్ష్మి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు.

అమ్మవారి మండపాల్లో పూజలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలోని మండపాల్లో నెలకొల్పిన అమ్మవారిని బుధవారం బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు, సురేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండప నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అమ్మవారి దయతో అందరూ ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో ఉండాలన్నారు.


మంటపంలో అమ్మవారికి పూజలు చేస్తున్న పన్నాల హరీష్‌రెడ్డి, వడ్డేపల్లి రాజేశ్వరరావు

ఎల్లమ్మబండలో..

ఎల్లమ్మబండ ఎన్‌టీఆర్ నగర్‌లోని జై మాతాజీ యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన దుర్గామాతను బీఆర్‌ఎస్ మాజీ అధ్యక్షుడు జిల్లా గణేష్ నేత బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్‌టీఆర్‌నగర్‌లో సుమారు 40మంది యువకులు నవరాత్రి దీక్షలు చేపట్టడం శుభపరిణామమన్నారు.


ఎల్లమ్మబండలో అమ్మవారికి పూజలు చేస్తున్న జిల్లా గణేష్ నేత తదితరులు


మార్కెట్‌లోని అన్నదానం చేస్తున్న నిర్వాహకులు


హస్మత్‌పేట చౌరస్తాలో అమ్మవారి మండపంలో..

బాస్కెట్ బాల్ పోటీల్లో జేఎన్‌టీయూహెచ్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డా. విజయకుమార్‌రెడ్డి

బాలానగర్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడారంగంలో ప్రావీణ్యత సంపాదించి ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని జేఎన్‌టీయూహెచ్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా. విజయకుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం జేఎన్‌టీయూహెచ్ క్యాంపస్ కళాశాల విద్యార్థులు హైదరాబాద్‌లోని ఎంజీఐటీలో జరిగిన ఇంటర్ కళాశాల స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొని బాస్కెట్ బాల్ బాలుర పోటీల్లో పాల్గొని ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. విజయకుమార్‌రెడ్డి, స్పోర్ట్స్ సెక్రటరీ కౌన్సిల్ డా. ఎన్. దిలీప్, విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడ ఎలాంటి స్పోర్ట్స్ ఈవెంట్స్ జరిగిన జేఎన్‌టీయూహెచ్ విద్యార్థులు పాల్గొని విజేతలుగా నిలిచిన యూనివర్సిటీకి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. స్పోర్ట్స్‌లో పాల్గొనే వారికి కళాశాల నుంచి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

కూకట్‌పల్లిలో వాసన్ ఐ కేర్ ప్రారంభం



వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు

భాగ్యనగర్‌కాలనీ: దేశంలోని ప్రముఖ కంటి ఆసుపత్రి చైన్ వాసన్ ఐ కేర్ సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పిటల్ కూకట్‌పల్లిలో బుధవారం ప్రారంభించారు. వాసన్ ఐ కేర్‌ఒక ఏఎస్‌జీ గ్రూప్ ఆఫ్ ఐ హాస్పిటల్ భారత దేశంలోని 63 నగరాల్లో 160 శాఖలతో విస్తరించిందని నిర్వాహకులు తెలిపారు. కూకట్‌పల్లిలో అత్యాధునిక సౌకర్యాలతో ఆస్పత్రిని ఏర్పాటు చేశామన్నారు.

గ్లోబల్ అలుమ్నీ మీట్ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ కట్టా నరసింహారెడ్డి, అలుమ్నీ మీట్ వరల్డ్ అధ్యక్షుడు హరిప్రసాద్

బాలానగర్: జేఎన్‌టీయూహెచ్‌లో గ్లోబల్ అలుమ్నీ మీట్ 2023 కార్యక్రమాన్ని డిసెంబర్ 22, 23వ తేదీల్లో నిర్వహించనున్నట్లు వీసీ కట్టా నరసింహారెడ్డి బుధవారం తెలియజేశారు. కార్యాలయంలోని సమావేశ మందిరంలో గ్లోబల్ అలుమ్నీ మీట్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్లోబల్ అల్యూమిన్ మీట్ అనేది మొట్టమొదటిసారిగా జేఎన్‌టీయూహెచ్‌లో నిర్వహిస్తున్నామన్నారు. యూనివర్శిటీ, ఇంజినీరింగ్ అనుబంధ కళాశాలల్లో విద్యను అభ్యసించి, వివిధ దేశాల్లో ఉంటున్న సుమారు రూ.2.50లక్షల మంది వరకు ఉన్నారని అన్నారు. అలుమ్నీ మీట్ వల్ల విద్య, వైద్య, వ్యాపార రంగాల్లో జేఎన్‌టీయూహెచ్ విద్యార్థులకు చేయూతనిచ్చేందుకు పలువురు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించటం వల్ల నూతన ఉత్తేజం ఏర్పడుతుందన్నారు. ఆసక్తి గల పూర్వపు విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు uaa.jntuh.ac.in వెబ్‌సైట్‌ను వీక్షించవచ్చని కోరారు. కార్యక్రమంలో అలుమ్నీ మీట్ వరల్డ్ అధ్యక్షుడు హరిప్రసాద్, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ తారా కళ్యాణి, ప్రొఫెసర్ జ్యోతుల సురేష్‌కుమార్, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాత్రి 11గంటల లోపు షాపులు మూసివేయాలి

మాదాపూర్ ఏసీపీ శ్రీనివాస్

గచ్చిబౌలి: రాత్రివేళ అన్ని దుకాణాలు 11గంటలలోపే మూసివేయాలని మాదాపూర్ ఏసీపీ శ్రీనివాస్ స్పష్టం చేశారు. గచ్చిబౌలి డీఎల్‌ఎఫ్ ప్రాంతం, మాదాపూర్, రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని స్ట్రీట్ వెండర్స్‌తో గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికల నిబంధనలు విధిగా పాటించాలని సూచించారు. రాత్రివేళ తనిఖీలు ఉంటాయని చెప్పారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్ జేమ్స్‌బాబు, సబ్ ఇన్‌స్పెక్టర్లు శోభన్‌బాబు, భానుప్రసాద్, రాజశేఖర్‌రెడ్డి, పోలీసులు, స్ట్రీట్ వెండర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీలను ప్రజల్లోకి తీసుకెళ్తాం


యూత్ కమిటీ సభ్యులతో సమావేశమైన నేషనల్ జాయింట్ సెక్రటరీ చరిత, నాయకుడు సునీల్‌కుమార్ యాదవ్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ సునీల్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం యూత్ కాంగ్రెస్ డివిజన్ ప్రెసిడెంట్స్, యూత్ కమిటీ సభ్యులతో రాబోయే సార్వత్రిక ఎన్నికలు, బూత్‌స్థాయి కమిటీ నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ నేషనల్ జాయింట్ సెక్రటరీ చరిత కొనకల్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సునీల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ... రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నేటి నుంచి ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. డివిజన్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి హామీలను ప్రజలకు వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు, యూత్ డివిజన్ ప్రెసిడెంట్స్, వర్కింగ్ ప్రెసిడెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

3కిలోల బంగారం.. 1.5కిలోల వెండి పట్టివేత



భాగ్యనగర్‌కాలనీ: ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో పోలీసులు వాహనాలు తనిఖీలను ముమ్మరం చేశారు. కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి పీఎస్‌ఆర్ ఎంపైర్ భవనం ఎదురుగా జాతీయ రహదారిపై పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఓ వాహనంలో తరలిస్తున్న 3.193 కేజీల బంగారు ఆభరణాలు, 1.569 కిలోల వెండిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మహమ్మద్ ఇమ్రాన్, బీరేంద్రసింగ్, విజయ్‌కుమార్‌లను అదుపులోకి తీసుకొని కేపీహెచ్‌బీ పోలీసులకు అప్పగించారు. పెద్ద మొత్తంలో బంగారం, వెండి ఆభరణాలు ఎక్కడి నుంచి ఎక్కడికి తరలిస్తున్నారనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. వివిధ ప్రాంతాల్లో ఆర్డర్లపై బంగారాన్ని తరలిస్తున్నట్లు చెప్పారని పోలీసులు పేర్కొన్నారు.


వాహనాల తనిఖీల్లో పట్టుబడ్డ బంగారం, వెండి

బూత్ కమిటీలు కలసికట్టుగా పనిచేయాలి


బూత్ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి

బాలానగర్: బూత్ కమిటీ సభ్యులందరూ కలిసికట్టుగా కలిసి పనిచేసి రాబోయే ఎన్నికల్లో బీఆర్‌యస్ పార్టీని గెలిపించి హ్యాట్రిక్ సాధించాలని బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి అన్నారు. బుధవారం బాలానగర్ డివిజన్ పరిధిలోని సాయినగర్, వినాయకనగర్ కాలనీలకు సంబంధించిన బూత్ కమిటీ సభ్యుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌యస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో బూత్‌కమిటి సభ్యుల పాత్ర కీలకమైనదని అన్నారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు దర్శనం శాఖయ్య, డివిజన్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాజా, కూకట్‌పల్లి మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ మండడి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ, అభివృద్ధిని ప్రతి ఓటరుకు వివరించాలి

మూసాపేట: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు బుధవారం మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ మూసాపేట డివిజన్ పరిధిలోని భరత్‌నగర్ ఈడబ్ల్యూఎస్, మూసాపేట్ ఓల్డ్ విలేజ్, అంబేడ్కర్‌నగర్, బాబు జగ్జీవన్‌రామ్ బస్తీలకు సంబంధించిన బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మాధవరం కృష్ణారావు గెలుపు కోసం బూత్‌స్థాయిలో అనుసరించాల్సిన వ్యూహాలను వివరించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను, జరిగిన అభివృద్ధిని ప్రతి ఓటరుకు వివరించాలని సూచించారు. వారితో పాటు డివిజన్ పరిశీలకులు మాజీ కార్పొరేటర్ నరేంద్ర ఆచార్య, డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, సీనియర్ నాయకులు కర్క పెంటయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.


మూసాపేట డివిజన్‌లో బూత్ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న తూము శ్రావణ్‌కుమార్

హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గాంధీ విజయం ఖాయం


మహిళా నాయకులతో సమావేశమైన కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని మహిళా బీఆర్‌ఎస్ పార్టీ నాయకురాళ్లు, డివిజన్, అనుబంధ కమిటీ సభ్యులతో బుధవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ విజయం సాధించడానికి అందరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ మహిళలు బీఆర్‌ఎస్ పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటున్నారని అన్నారు. ఇక ముందు కూడా ఇదే విధంగా పనిచేసి శేరిలింగంపల్లి శాసనసభ్యులు అరెకపూడి గాంధీకి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గాంధీ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డివిజన్ పార్టీ అధ్యక్షుడు సమ్మారెడ్డి, మహిళా నాయకురాళ్లు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..

బంగారు బతుకమ్మ ఉయ్యాలో..




కూకట్‌పల్లిలోని హనుమాన్‌చౌక్, వెంకట్‌రావునగర్ కాలనీ, దేవిస్థాన్ హోమ్స్ తదితర ప్రాంతాల్లో బతుకమ్మ వేడుకలు కనులపండువగా కొనసాగుతున్నాయి. అనంతరం ఐడీఎల్ చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. అదేవిధంగా వివేకానంద, సంఘమిత్ర కళాశాలల్లో బుధవారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో వచ్చి బతుకమ్మ వద్ద ఆడిపాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కె. నరేష్ పాల్గొని తెలంగాణలో బతుకమ్మకు చాలా పవిత్రమైన పండగలా చేస్తారన్నారు. – కూకట్‌పల్లి



బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న కళాశాల కరస్పాండెంట్ నరేష్, ఉపాధ్యాయులు, విద్యార్థినుల కోలాటం







